క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సబ్ స్టేషన్ ఏఈఈ సురేష్ కుమార్ తెలిపారు. లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా బంటుబిల్లి వారి కళ్లాలు, మచ్చవానిపాలెం, పడాల వారి కళ్లాలు, పల్లిపేట గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ అన్ని రకాల విద్యుత్ వినియోగదారులకు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

32 పందుల ఏరివేత

తగరపువలస: భీమిలి జోన్‌లోని తగరపువలస, భీమిలి, చిట్టివలస పరిధిలో మంగళవారం 32 పందులను శానిటేషన్ సిబ్బంది బంధించి తరలించినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు తెలిపారు. తరచూ ఈ ప్రాంతంలో నివాసాల మధ్య పందుల సంచారం అధికంగా ఉండటంతో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా పందులను తరలించడం, సంహరించడం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పందుల ఏరివేతను జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శంకరరావు పర్యవేక్షించారు.

దాడి చేశారని కాల్‌మనీ వ్యాపారులపై ఫిర్యాదు

తగరపువలస: కాల్‌మనీ వ్యాపారులు తగరపువలస కూడలిలో తన కారుకు అడ్డంగా ద్విచక్ర వాహనం పెట్టి తనపై దాడికి ప్రయత్నించారంటూ జీవీఎంసీ భీమిలి జోన్ కాంట్రాక్టర్ జె.కె.డి.వి.ప్రసాదరాజు భీమిలి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. బ్యాంకు కాలనీలో తాను నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాల్‌మనీ వ్యాపారులు తనకు రూ.15 లక్షలు ఇవ్వాల్సి ఉండగా తననే రూ.లక్ష ఇవ్వాలని బెదిరించారన్నారు. దీనిపై భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఇరువురి మధ్య నగదు లావాదేవీల విషయమై తగాదా జరిగి ఉంటుందన్నారు. దీనిపై ఫిర్యాదు అందిందని, విచారిస్తున్నట్టు తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

కొమ్మాది: ద్విచక్ర వాహనం కె.నగరపాలెం జంక్షన్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడకు చెందిన దుర్గారావు మంగళవారం వైజాగ్ నుంచి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

పద్మనాభం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను భీమునిపట్నం డైట్ లెక్చరర్ ఎస్.త్రినాథరావు మంగళవారం సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. రౌతులపాలెం, కురపల్లి, పాండ్రంగి ప్రాథమిక పాఠశాలలు, పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. లీడ్, లిప్, ఎండీఎం అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులు దిద్దుతున్నారా..? లేదా..? పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఈవో ఎం.శివరాణి పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవాలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం రెల్లి కాలనీలో రెండు రోజులు జరగనున్న రామాలయ ద్వితీయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రాంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో భజనలు చేశారు. ఆలయం విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందింది. బుధవారం హోమాలు, అన్నదానం చేయనున్నారు.

మందుబాబులకు రూ.1.55 లక్షల జరిమాన

పీఎం పాలెం : గత 10 రోజులుగా రాత్రిపూట ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 40మందిపై కేసులు నమోదు చేశామని ట్రాఫిక్ సీఐ మురళీ కృష్ణ తెలిపారు. వారికి రూ.1.55 లక్షల జరిమాన విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయం



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఛాత్రోపాధ్యాయులు



పీఎం పాలెంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చిప్పాడ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: భర్త జ్యోతీరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి పూలే చదువుకుని విద్యావంతురాలై ఉపాధ్యాయురాలిగా బాలికల కోసం పాఠశాలలను ప్రారంభించిందని భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రేక అప్పారావు అన్నారు. మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1848లోనే దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన మొదటి మహిళగా ఆమె జీవితం ఇతర మహిళలకు మార్గదర్శనీయమన్నారు. బాల్య వివాహాలు, కుల వివక్ష నిర్మూలనకు ఆమె పాటుపడిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.రాజేశ్వరి, ఆర్.త్రివేణి, జె.ప్రసాదరావు, డీవీ సత్యవతి, అనూరాధ, అహల్య, సుధారాణి, రమేష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భీమిలి ఆదర్శప్రేమీ మండలి ఆధ్వర్యంలో...
భీమిలి ఆదర్శప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యావ్యాప్తికి ఆమె చేసిన కృషిని దక్షిణ భారత హిందీ ప్రచారసభ విద్యార్థులకు వివరించి పుస్తకాలు పంపిణీ చేశారు.

మహిళా విద్యకు ఎనలేని కృషి
భీమునిపట్నం: మహిళల పట్ల వివక్ష చాలా ఎక్కువగా ఉన్న రోజుల్లో వారి విద్య కోసం ఎన్నో విధాలుగా పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని జిల్లా విద్యశిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు అన్నారు. కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ స్త్రీలను విద్యావంతులను చేస్తే ఎన్నో సమస్యలు, ఇబ్బందులు తొలగిపోతాయని ఆమె ఎంతో విశ్వసించారని పేర్కొన్నారు. అందులో భాగంగా అనేక ప్రాంతాల్లో వారిని ప్రోత్సహించడంతోపాటు విద్యాలయాలను కూడా ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు చదుకుని అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే ఆమె చేసిన కృషి ఎంతో ఉందన్నారు. ఆమె సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకుని స్మరించుకోవాలని కోరారు. అధ్యాపకులు జీజీ నాగేశ్వరరావు, గొట్టేటి రవి, ఎం.మహాలక్ష్మి, సీపీ సోమయాజులు, షేక్ అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

పీఎం పాలెం: సావిత్రిబాయి పూలే జయంతిని పీఎం పాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి రాష్ట్ర నగరాలు కార్పొరేషన్ చైర్ పర్సన్ పిల్లా సుజాత, ఆరో వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, గాదె రోశిరెడ్డి, ఈఎస్ఎస్ చంద్రరావు, పిల్లా సత్యనారాయణ, రాయిన సాయి, యర్రాజీ, జామి శివకుమార్, అప్పారావు నివాళులర్పించారు.

బాబా ఇంజినీరింగ్ కాలేజీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పల్లవి ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ గోవింద రాజు, కె.శ్రీలక్ష్మి పాల్గొన్నారు

మధురవాడ: అట్టడుగు వర్గాల మహిళల విద్యాభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని పలువురు నాయకులు కొనియాడారు. జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీ సమీపంలో గల మధురవాడ విశ్వకర్మ భగవాన్ కార్పెంటర్స్ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి పార్వతీశం, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, మధురవాడ సంఘం నాయకులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విత్తనశుద్ధితో కత్తెర పురుగు నివారణ సాధ్యం



విత్తనశుద్ధిపై అవగాహన కలిగిస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: విత్తనశుద్ధి, సస్యరక్షణ చర్యలతో మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారించవచ్చని వ్యవసాయాధికారులు సూచించారు. ఈ మేరకు భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో రైతులకు మంగళవారం అవగాహన కలిగించారు. అనకాపల్లి డాట్ సెంటర్ ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త బి.భవాని మాట్లాడుతూ కత్తెరపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కిలో విత్తనానికి 6 మిల్లీ లీటర్ల సియాన్ ట్రానిలిప్రోల్, థయామిథాక్సమ్ అనే పురుగు మందులతో విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా 15 నుంచి 20 రోజుల వరకు కత్తెర పురుగు ఆశించకుండా మొక్కజొన్న పంటను కాపాడుకోవచ్చన్నారు. అలాగే లీటరు నీటిలో 1500 పీపీఎం వేపనూనె 5 మిల్లీమీటర్లు కలిపి మొవ్వలో పిచికారి చేసుకోవాలని సూచించారు. దుక్కి సమయంలో 67 కిలోల యూరియా, 200 కిలోల ఎస్ఎస్‌పీ, 25 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. తర్వాత 30 నుంచి 35 రోజుల మధ్య 67 కిలోల యూరియా, పూతదశలో 67 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్సీ, ఏడీఏ చదువుల సుబ్రహ్మణ్యం, డీఆర్సీ ఏవో సీహెచ్.సురేష్, భీమిలి ఏడీఏ బి.విజయప్రసాద్, ఏవో బి.శివకోమలి, హబ్ ఏవో శ్రీకాంత్, వీఏఏ బి.స్వాతి, మొక్కజొన్న పొలంబడి రైతులు పాల్గొన్నారు.

గ్రామ కంఠం స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న గ్రామ కంఠం స్థలాన్ని కొంత మంది ఆక్రమించారని అదే గ్రామానికి చెందిన అమూజూరి అప్పారావు, పల్లి మహేష్‌తోపాటు పలువురు తహసీల్దార్ ఎం.వి.ఎస్.లోకేశ్వరరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారని ఆ ఫిర్యాదులో తెలిపారు. ఈ స్థలంలో అమ్మవారి పండగ సమయంలో సిరిమాను, రథాలు ఉంచేవారిమని పేర్కొన్నారు. పూర్వీకుల నుంచి ఆ స్థలాన్ని గ్రామ అవసరాలకు ఉపయోగించేవారిమని ఆ ఫిర్యాదులో తెలిపారు. గ్రామ కంఠం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించడం వల్ల గ్రామస్తులందరూ ఇబ్బంది పడడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆక్రమణలు తొలగించాలని ఆ ఫిర్యాదులో కోరారు.

గుడిలోవ విద్యార్థి ప్రతిభ



ఆనందపురం : మండలంలోని గుడిలోవ సరస్వతి విద్యా విహార్‌కు చెందిన విద్యార్థి పరుగు పందెంలో వెండి పతకం సాధించాడని పాఠశాల యాజమాన్యం తెలిపింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముద్రగడ ధనుష్ సత్యసాయి జిల్లా, హిందూపురంలో జరిగిన జిల్లా స్థాయి వంద మీటర్ల పరుగు పందెంలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి వెండి పతకం సాధించాడు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ధనుష్‌ని ఉపాధ్యాయులు అభినందించారు.

శింగనబందలో డ్రోన్ సర్వే ప్రారంభం

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో డ్రోన్ సర్వేను జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు డొకరపేట గ్రామంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూరు శాతం పారదర్శకతతో భూములను సర్వే చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రీ సర్వేతో దళారుల ప్రమేయం తగ్గిపోతుందన్నారు. బయట ప్రాంతాల్లో ఉన్న రైతులు అధికారుల సాయంతో రీ సర్వే చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ గాడు వెంకట నారాయణ, గాడు శ్రీను, వీఆర్వో శ్రీను, సర్వేయర్ రేష్మ, గుడ్లాల ఎల్లయ్య, తాతినాయుడు పాల్గొన్నారు.

12 తులాల బంగారు ఆభరణాలు చోరీ

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఊళ్లపేట - సంగివలసకు చెందిన ములుపురి కిషోర్ ఇంట్లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు 12 తులాల బంగారు ఆభరణాలు, వెండి కుంకుమ బరిణె చోరీ చేశారు. కిషోర్ దివీస్‌లో ఉద్యోగానికి వెళ్లిపోగా అతని భార్య గోపీబాల మామయ్యను తీసుకుని ఉదయం 11.30 సమయంలో సంగివలస ఎన్ఆర్ ఆస్పత్రికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు వచ్చారు.

ఇంటి మెయిన్‌గేటుతోపాటు బీరువా తెరిచి ఉండడంతో అందులో చూడగా ఆభరణాలు కనిపించ లేదు. వెంటనే ఆమె భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎంపీలను ప్రభుత్వం గుర్తించాలి



కొత్తగా ఎన్నికైన గ్రామీణ వైద్య సంఘ సభ్యులు

భీమునిపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చక్కని వైద్యం అందించి ఆదుకుంటున్న ఆర్ఎంపీ వైద్యులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ వైద్యుల సంఘ సలహాదారు డాక్టర్ ఎస్.ఎల్.రావు కోరారు. మంగళవారం ఇక్కడ గ్రామీణ వైద్యుల సంఘ కొత్త కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యం అందిస్తున్న వీరంతా ఎంతో మందికి ప్రాణదాతలుగా నిలుస్తున్నారన్నారు. కార్యవర్గం అధ్యక్షులుగా ఎస్.విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా వి.అప్పలకారురెడ్డి, కార్యదర్శిగా రేవతి, సహకార్యదర్శిగా లక్ష్మిబాయి, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాసరావు, గౌరీష్ ఎన్నికయ్యారు.

128 మందికి వైద్య పరీక్షలు



మజ్జిపేట సచివాలయంలో వైద్య శిబిరంలో సిబ్బంది

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్, తాళ్లవలస పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం భీమిలి మండలం మజ్జిపేటలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ మజ్జి సూరినాయుడు ప్రారంభించిన ఈ శిబిరంలో వైద్యురాలు శోభారాణి, 104 వాహన వైద్యుడు శివరామకృష్ణ 128 మందికి ఉచితంగా వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా రక్తపరీక్షలు చేశారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు స్థానికులకు హెచ్ఐవీ, సుఖవ్యాధులు, క్షయపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో లింక్‌వర్కర్ ఎం.జ్యోతి, రత్నకుమారి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల సంబరాలు



బొగ్గురోడ్డు సచివాలయంలో పింఛన్ల నగదు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రేఖవానిపాలెంలో పింఛన్ నగదు అందిస్తున్న నాయకులు

తగరపువలస: ఈ ఏడాది నుంచి పెరిగిన రూ.250 కలిపి రూ.2750 చొప్పున పింఛన్ నగదు భీమిలి సచివాలయాల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వరుసగా మూడో రోజు మంగళవారం పంపిణీ చేశారు. భీమిలి మండలం రేఖవానిపాలెంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు మల్లేటి హరిశంకర్, వార్డు సభ్యులు పీతల గంగశ్రీను, ఎం.మహేష్‌వర్మ, కన్వీనర్ పలపాల పద్మ పంపిణీ చేశారు. జీవీఎంసీ 2వ వార్డు బొగ్గురోడ్డు సచివాలయంలో ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చిల్ల సూరి నరసయ్యరెడ్డి, వంశీరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. చిల్లపేటలో దివ్యాంగుల పింఛన్‌ను సచివాలయ కన్వీనర్ బింగి హరికిరణ్‌రెడ్డి, అడ్మిన్ కిషోర్, వెల్ఫేర్ సెక్రటరీ కల్యాణ్, వీఆర్వో రాము పంపిణీ చేశారు.

కొత్త పింఛన్ల పంపిణీ నేడు

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయం వద్ద 252 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లు భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం పంపిణీ చేయనున్నారని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రాధ తెలిపారు. ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మామిడిలోవ పంచాయతీ దబ్బందలో మంగళవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్న ఘనత జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. కరోనా వంటి సంక్షోభాలు చుట్టిముట్టినా ప్రజా సంక్షేమాన్ని మాత్రం ఆయన విడనాడలేదన్నారు. విద్య, వైద్య, ఉపాధి, వసతి రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించామన్నారు. గతంలో సమస్యలు చెప్పుకోవడానికి ప్రజలు నాయకుల చుట్టూ తిరిగేవారని... కానీ నేడు సమస్యలు తెలుసుకోవడానికి నాయకులే మీ ఇంటికి వస్తున్నారని ఇలాంటి పాలనను ఎప్పుడూ చూసి ఉండరన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ దబ్బంద భూములన్నింటినీ వీఎంఆర్‌డీఏ గ్రీన్ జోన్‌లో పెట్టడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తొలగించే ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ బీసీ కాలనీలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, మురుగునీటి కాలువలు నిర్మించాలని, ఎస్సీ కాలనీలో పాత ఇళ్లు కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయని, మరమ్మతులకు నిధులు ఇప్పించాలని, అర్హులకు కాలనీ ఇళ్లు మంజూరు చేయాలని, గెడ్డలు ఉన్న ప్రాంతంలో కల్వర్టులు నిర్మించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించడానికి వెంటనే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, మండల ఉపాధ్యక్షుడు పాండ్రింకి శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు పావాడ గౌతమి, సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, డోల దేవుడు, బలిరెడ్డి మహేష్, పాండ్రింకి అప్పారావు, లెంక రాంబాబు, డోల ఆనంద్, కోరాడ వెంకట రమణారావు, సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతకు కృషి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎమ్ జయప్రద

మధురవాడ: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అందరూ సహకరించాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రద, రాజబాబు కోరారు. మంగళవారం ఇక్కడ నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో వారు మాట్లాడారు. పిల్లలు మరింత మంచి ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయుల కృషికి తల్లిదండ్రుల తోడ్పాటు అవసరమన్నారు. పాఠశాలలో చెప్పిన పాఠాలు ఇంటి వద్ద కూడా చదివేటట్టు చూడాలన్నారు. అవసరమైతే సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు

- వంద ప్లాట్లు దాటితే ఎస్టీపీ ఉండాలి
- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



పరదేశిపాలెంలో నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

మధురవాడ: జీవీఎంసీలో ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. జోన్ - 2లోని 5, 8వ వార్డులతోపాటు భీమిలి జోన్‌లోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి నిర్మాణాలు పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ప్లాన్‌లు ఉల్లంఘిస్తే ఉపేక్షించవద్దని, తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ప్లాన్ మంజూరు చేసేటప్పుడు ఫీల్డ్‌కి వెళ్లి ఆయా స్థలాలు పరిశీలించాలని సూచించారు. అలాగే వంద ప్లాట్‌లు దాటిన అపార్ట్‌మెంట్ల చుట్టూ ఖాళీ స్థలం, ఎస్టీపీ ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఆమోదం కోసం వచ్చిన ప్లాట్‌లు చాలా జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీపీ సురేష్, డీసీపీ పద్మజ, ఏసీపీ శాస్త్రి శబ్‌నాన్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి జోన్‌లో కుక్కల బెడద

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2, 3 వార్డుల ప్రజలను వీధికుక్కలు భయాందోళనలకు గురి చేస్తున్నాయి. నడిచి, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని రోడ్లపై తిప్పవేసి వెంబడించి కరుస్తున్నాయి. కొత్తపేట, చిట్టివలస, సంతపేట విల్సన్‌పేట, వెలంపేట, భీమిలి తదితర ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతుండటంతో స్థానికులు రోడ్లపైకి ఒంటరిగా రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఎక్కడో విశాఖ నగరంలో కుక్కలను పట్టి శస్త్రచికిత్స చేసి భీమిలి జోన్‌లో వదలివేయడం వల్ల కొత్తగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ భీమిలి జోనల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆహార ఉత్పత్తుల తయారీతో ఆర్థిక స్వావలంబన



మాట్లాడుతున్న సెర్ప్ డైరెక్టర్ సరళ

పద్మనాభం: పీఎంఎఫ్ఎంఈ కింద రాష్ట్రంలో ఆహార ఉత్పత్తుల తయారీ ద్వారా 7,559 మందికి లబ్ధి చేకూరుతున్నట్టు సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ కె.సరళ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆహార ఉత్పత్తుల తయారీపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ఆహార ఉత్పత్తుల తయారీకి స్వయం సహాయక సంఘాల సభ్యులకు విత్తన మూలధనం కింద రూ.40 వేలు ఇస్తున్నట్టు తెలిపారు. డిసెంబర్ 28 నుంచి 7,559 మందికి జిల్లాల వారీగా శిక్షణ ప్రారంభించామన్నారు. పీఎంఎఫ్ఎంఈ కో - ఆర్డినేటర్ సత్యనారాయణ, డీపీఎం వైదేహి, ఏపీఎం ప్రభాకర్, ఏరియా కో – ఆర్డినేటర్ సత్యనారాయుడు పాల్గొన్నారు.